
# రోల్ ప్లే

ఎమ్మెస్వీ గంగరాజు

'రోల్‌ప్లే' అంటే సర్వజనీనమైన అభిప్రాయం- ఎవరి విధిని వాళ్లు నిర్వర్తించడం! ఈ 'రోల్ ప్లే' అనే పదం చాలా పాపులర్ అయిపోతూ ఎందరి నోళ్లలోనో తరచూ నానుతూ ఉండడం ఈ మధ్య గమనిస్తూనే ఉన్నాను. 'రోల్ ప్లే' ఎంత బాగా చేస్తే (పాత్రలో ఎంత బాగా నటిస్తే) నాటకం అంత బాగా రక్తి కడుతుందన్నమాట! నాటకం చూసే వారికైతే బాగానే వుంటుంది. కాని కొండొకచో ఈ 'రోల్ ప్లే' కొందరికి కంటకప్రాయంగా మారవచ్చు! ఎలాగంటే.... ***



ఆ మధ్య మా బ్రాంచి స్టాఫ్ నాటకం ప్రదర్శిం చారు. దానిలో అప్పారావనే మెసెంజరు యజ మాని పాత్రవేశాడు. సేవకుని పాత్ర ఆఫీసరొకతను వేశాడు. వారం, పది రోజులు రిహార్సెల్స్ బాగానే సాగాయి. ఉగాది నాడు నాటిక ప్రదర్శన ఓ హాల్లో ఏర్పాటు చేశాం. చూడడానికి జనం చాలా మంది వచ్చారు. హాలంతా నిండిపోయింది. ఇక చూస్కోండి! ఆ జనసందోహాన్ని చూసి అమితో త్సాహపడిపోయిన మా అప్పారావు యజమాని పాత్రలో జీవించేయడం మొదలెట్టాడు. చీటికి మాటికీ సేవకుని మీద చేయిచేసుకునే కోపిష్టి యజ మాని పాత్ర అతడిది. రిహార్సెల్స్‌లో సుతారంగా కొట్టేట్టు నటించిన అప్పారావు నాటకం ప్రదర్శన రోజు మాత్రం నిజంగానే సేవకుని (రోలు వేస్తున్న ఆఫీసర్) చెంపలు వాయించడం ప్రారంభించాడు. అలా కొడుతూ అతడు చెప్తున్న డైలాగులు రావుగో పాలరావు డైలాగుల్లా 'కాచింగ్'గా ఉండడం వలన ఆడియన్స్‌లో ఉత్సాహం పెచ్చుపెరుగుతూ 'వన్స్ మోర్' అంటూ చప్పట్లతో హాలంతా దద్దరిల్లేది. దీనితో మా అప్పారావు మరీ రెచ్చిపోయి యజ మాని పాత్రలో పూర్తిగా జీవించేశాడు. పాపం, ముసిలెద్దు బాధ కాకికేమి తెలుస్తుంది? సేవకుని వేషంలో ఉన్న ఆఫీసర్‌కి ఆ నాటకం నరకమే అయింది.

తర్వాత తెలిసింది. ఈ ఆఫీసర్ బ్రాంచిలో అప్పారావుని కాల్చుకు తింటున్నాడట! అతడికి ఒక్క క్షణం కూడా విశ్రాంతినియ్యక ఏదో పని పుర మాయిస్తుంటాడట. పైగా 'నేనేదో నా స్వంత పని చేయమంటున్నట్టు ముఖం పెడతావేం? నేను చేయమంటున్నది ఆఫీస్ పనే! నా పని నేను విశ్రాంతి లేకుండా చేయడంలా? అలాగే నీ పనీ నువ్వు సిన్సియర్‌గా చెయ్యాలి. కేవలం ఇది 'రోల్‌ప్లే' మాత్రమే! పని ఎక్కువ చేసేస్తున్నానని మధనపడిపోకు. తెలిసిందా?' అంటూ ఓ చిన్న క్లాసు కూడా పీకేడుట ఒక రోజు.

ఉగాది మర్నాడు ఆ ఆఫీసర్ నా చాంబర్‌లో కొచ్చి ''చూసారా, సార్ ఈ అప్పారావుగాడి అమా నుషం?! నాటకంలో నటన ప్రదర్శించాలి గాని అవ కాశం దొరికింది కదా అని అలా నిజంగా ప్రవర్తిస్తే ఎలా? పైగా అతడికి మీరంతా కలిసి 'బెస్ట్ యాక్టర్' అవార్డు కూడా కట్టబెట్టేరు. చెంప దెబ్బలు నాకు, చామంతిపూల దండ అతడికీ!! బాగుంది వరస!'' అన్నాడు ఉక్రోషంగా.

వస్తున్న నవ్వుని లోలోపల అణచుకుంటూ, ''ఆడియన్స్ బాగా రిసీవ్ చేసుకోవడం చూసి కాస్త ఎక్సయిటయినట్టున్నాడు. నేను మందలిస్తాను లెండి. నాటకాన్ని మొత్తానికి బాగా రక్తి కట్టించారు. కంగ్రాట్యులేషన్స్'' అంటూ అతణ్ణి కన్సోల్ చెయ్య డానికి ప్రయత్నించాను. నా మాటలు అతనికి ఊర డింపుగా తోచాయో, పుండుమీద కారం జల్లినట్టని పించాయో ఆ పరమాత్మకే తెలియాలి.

తర్వాత, అప్పారావుని పిలిచి, ''అదేమిటోయ్! కొట్టినట్టు నటించాలి కాని అలా 'ఫెటేల్, ఫెటేల్'మని నిజంగా అతడి దవడలు వాయించే శావ్, పాపం!?'' అన్నాను కాస్త మందలించే ధోర ణిలో.

''రోల్ ప్లే, సార్! నా 'రోలు' నేను ప్లే చేశాను. అంతే!!'' అన్నాడు ఓ వంకర నవ్వు నవ్వుతూ.

ఇక ఏమనగలను? 'రోలు ప్లే చెయ్యడమంటే రోటిలో పిండిలా అతన్ని రుబ్బేయడమా?' అనాల నుకున్న మాటలు నా నోట్లోనే ఉండిపోయాయి.

***

ఓసారి మా బంధువులమ్మాయి పెళ్లికని హైద రాబాదు బయలుదేరాను. ట్రెయిన్‌లో నాతోనే పని చేస్తూ ఆ సంవత్సరమే రిటైరైన కొలిగ్ ఒకాయన కలిశాడు. అతడూ హైదరాబాదుకే ప్రయాణం! రిటై ర్మెంటు బెనిఫిట్లన్నీ వచ్చేశాయట. కానీ, ఇంకేవో ఎరియర్స్ రావలసి ఉండిపోయాయట అందుకే ఈ ప్రయాణం.

''ఎవరి బాధ్యతలు వాళ్లు సక్రమంగా నిర్వర్తిస్తే, మనకీ బాధలే ఉండవు కదండీ, రివైజ్డ్ ఫిట్‌మెంట్ ఎరియర్స్ తయారు చెయ్యడానికి ఆ డిపార్ట్‌మెంట్ వాళ్లకి బద్ధకం. మనకేదో ఉపకారం చేసేస్తున్నట్టు భావిస్తారు. వాళ్ల 'రోల్‌ప్లే' వాళ్లు నిర్వర్తించకపోతే ఎలా? ఇప్పుడు ఈ హైదరాబాదు ప్రయాణం అన వసర ఖర్చు నాకు'' హెడ్డాఫీసు వాళ్లమీద మండిప డ్డాడు.

ఇంతలో టి.టి.ఇ. వచ్చాడు. నా టికెట్ చెక్ చేసుకుని అతడి చార్ట్‌లో టిక్ చేసుకున్నాడు. నా కొలిగ్ టికెట్ చూసి అతడి ఐడెంటిటీ కార్డు అడి గాడు. నా కొలిగ్ చేసిన పొరపాటేమి టంటే- అరవై సంవత్సరాలు నిండాయి కనుక అతడు సీనియర్ సిటిజెన్ అయిపోయాడని కన్సెషన్ కోసం కక్కుర్తి పడి సీనియర్ సిటిజన్ కన్సెషన్ టిక్కెట్టు కొనుక్కున్నాడు. అంతవరకూ బాగానే వుంది! అయితే, వయసుని ధృవీకరించడానికి ఐడెంటిటీ కార్డేదీ జేబులో వేసు కోకుండా బయలుదేరిపోయాడు. అదీ అతడి పొర పాటు! అప్పుడప్పుడే అరవై నిండిన వారు 'అటూ- ఇటూ'లా ఉంటారు కాబట్టి వయసుని రూఢీ చేసుకోవడానికి ఐడెంటిటీ కార్డుని అడగడం టి.టి.ఇ. తప్పేమీ కాదు.


కార్డు మరచిపోయానని చెప్పి ఇతడు తెల్ల ముఖం పెట్టి ఉంటే ఎలాగుండేదో! అలా కాకుండా తాను ఫలానా బేంకు మేనేజరుగా చేస్తూ రిటైర య్యాడనీ, రిటైరవ్వడం అంటే అరవై నిండాకనే కదా! ఆ మాత్రం జ్ఞానం లేకపోతే ఎలా'? అన్నట్టు ఎదురు దాడికి దిగేడు.

దాంతో ఆ టి.టి.ఇ.కి తిక్కరేగి ఆరువందల పైచి లుకు పెనాల్టీ కట్టించుకున్నాడు. పైగా, డబ్బులు లెక్క పెట్టుకొని కోటుజేబులో పెట్టుకుంటూ తన తప్పేమీ లేదని, ఐడెంటటీ కార్డు లేకుండా ప్రయాణం చెయ్యడం నా కొలీగ్‌దే పొరపాటనీ, తన విధి తను నిర్వర్తించాననీ, అందులో వ్యక్తిగ తంగా నా కోలిగ్ మీద అతడికేమీ ద్వేషం లేదనీ వక్కాణించాడు. అంతే కాకుండా, తను చేసింది

## గొడవల్లేవు

**రాం**గోపాల్‌వర్మ సినిమా నుంచి ఈమధ్య అయేషా టకియాను తీసి వేశారు. వాళ్ళిద్దరి మధ్య ఏవో గొడవలు జరిగాయని బాలీవుడ్ టాక్. ''అదేంకాదు, రాంగోపాల్‌వ ర్మతో పని చేయడమంటే నిజానికి నాకు చాలా ఇష్టం. ఆయన సిని మాలో నేను సంతకాలు కూడా చేశాను. అయితే కాల్‌షీట్స్ అడ్జెస్ట్ కాలేదు. అంతకుముందే నేను సైన్ చేసిన షాదీ నెంబర్‌వన్, హోం డెలివరీ సినిమాల్లో నటించాల్సి వుంది. దాంతో రాము సినిమాలో యాక్ట్ చేయలేని పరిస్థితి వచ్చింది. ఇంతకుమించి ఇంకేం కాదు'' అంటోంది టకియా.






తన 'రోల్‌ప్లే' మాత్రమేనని ఓ కొసమెరుపు మెరిపించి మరీ కదిలాడు.

అంతవరకూ 'ఎవరి రోల్ ప్లే వాళ్లు సక్రమంగా నిర్వర్తించాలంటూ' చెప్తూ వచ్చిన నా కొలీగ్ టి.టి.ఇ. వదిలిన కొసమెరుపుకి కుదేలైపోయి తేలు కుట్టిన దొంగలా ఊరుకోక తప్పలేదు.

***

నేను పెళ్లి వారిళ్లు చేరేసరికి పెళ్లి పనులన్నీ ఎక్కడివక్కడే పెండింగ్‌లో ఉండడం గమనించాను. పెళ్లికూతురు తండ్రికి వెనకాముందూ ఎవరూ లేకపోవడం వలన ఆ దంపతులిద్దరూ పాపం పనుల ఒత్తిడిలో సతమతమౌతూండడం గమనించాను. పైగా మగపెళ్లివారు కొంత ఫైర్ బ్రాండట! అదో భీతి వాళ్లని పీడిస్తున్నట్టు గ్రహించాను. పెళ్లిళ్లు చేసిన అనుభవం నాకు లేకపోయినా, స్నేహితుల పిల్లలవీ, బంధువుల పిల్లలవీ చాలా పెళ్లిళ్ల అనుభవం ఉండడం వలన ''మీరేమీ దిగులు పడకండి. నేను వచ్చేశాగా! అన్నిపనులూ నేను చూసుకుంటా. మీరు నిశ్చింతగా పీటల మీద కూర్చోండి'' అంటూ భరోసా ఇచ్చేశాను పిల్ల తల్లిదండ్రులకి.

నా భరోసాకి వాళ్లిద్దరూ ఉబ్బితబ్బిబ్బవుతూ ''మీ మేలు మరచిపోలేం'' అన్నారు.

పెళ్లికూతురు తండ్రి నన్ను విడిదికి తీసుకుని వెళ్లి మగపెళ్లి వారందర్నీ పరిచయం చేసి వాళ్లకేం కావలసినా నాతో చెప్పమని, పెళ్లి పనులన్నీ నా హస్తగతం చేసినట్టు చెప్పి చేతులు కడిగేసుకున్నాడు.

''అంటే , ఆడపెళ్లివారి అధికార ప్రతినిధి మీరన్నమాట!'' అంటూ పక్కగదిలోంచి వచ్చాడో ఆసామీ తువ్వాలుతో మూతిని తుడుచుకుంటూ.

''అలాగే అనుకోండి. ఇంతకీ తమరు...?'' అంటూ నాన్నాను అతని పరిచయాన్ని కోరుతూ.

''అతను మా బంధువులలో ఒకరు. మా అధికార ప్రతినిధి అతనే!'' అన్నాడు పెళ్లికొడుకు తండ్రి చిన్నగా నవ్వి.

''చాలా సంతోషం!'' అనేసి వాళ్ల దగ్గర శెలవు తీసుకుని కళ్యాణమండపానికి చేరుకున్నాం మేం ఇద్దరం.

మగపెళ్లివారితో ఇబ్బంది కలగలేదు కాని ఏ ముహూర్తాన పరిచయమయ్యాడో వాళ్ల అధికార ప్రతినిధి మాత్రం నా దుంపతెంపేడు. ' ఇది కావాలి, అది కావాలి' అని సతాయిస్తూ.

'ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయానని' అనుకుని దుఃఖపడడం తప్ప అప్పుడు నేను చేయగలిగిందేముంది?

ఎలాగోలా పెళ్లి సవ్యంగా జరిగిపోయింది. ఆ అధికార ప్రతినిధి పెళ్లివారితోపాటు వెళ్లిపోతూ నా దగ్గరకి వచ్చి, ''అయ్యా, పెళ్లిలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాను. ఏమీ అనుకోకండి. మగపెళ్లివారి ప్రతినిధిగా నా ధర్మం నేను నెరవేర్చాను. ఇది 'రోల్ ప్లే' మాత్రమే!'' అంటూ ఓ నవ్వు నవ్వేసి వెళ్లిపోయాడు.

'వీడి రోల్‌ప్లే మండిపోనూ' అని మనసులోనే తిట్టుకుని నేను కూడా మా ఊరు ప్రయాణమయ్యాను.

ఆ మర్నాడుదయం ఆఫీసుకి చేరేసరికి నా టేబిల్ మీద ట్రాన్స్‌ఫర్ ఆర్డరుంది. మరో బ్రాంచికి బదిలీ చేశారు నన్ను.

***

నేను కొత్త బ్రాంచిలో చేరి వారం రోజులు దాటింది. కొత్త వాతావరణానికి అలవాటు పడిపోయాను. పనిలో పూర్తి అవగాహన కుదిరింది. స్టాఫంతా చురుగ్గా పనిచేసేవాళ్లే- ఒక్క సీతాపతి అనే ఆఫీసర్ తప్ప! అతడి టేబిలెప్పుడూ ఖాళీగా వుండేది. తోటి ఆఫీసర్లు పనిలో తలమునకలవుతున్నా అతడు అలా చూస్తూ కూర్చునేవాడు కాని వాళ్లకి సాయపడే ప్రయత్నం చేసేవాడు కాదు. నా ఛాంబర్‌లోంచి అతణ్ణి గమనిస్తూ ఉండేవాణ్ణి.

ఒకరోజు సబ్-మేనేజర్ని లోనికి పిలిచి - ''సీతాపతికి వర్క్ ఏమీ ఇవ్వరా; ఏమిటి? అతడలా ఖాళీగా కూర్చుంటున్నాడు!'' అన్నాను.

''ఇచ్చినా అతడు చెయ్యడు, సార్. పక్కన పెట్టేస్తాడు. ఏమైనా అంటే తనకి చేతకాదంటాడు'' అన్నాడు సబ్-మేనేజర్.

సీతాపతి వైఖరి నాకు మింగుడు పడలేదు. లోనికి పిలిచి మందలించానొక రోజు.

'అలాగేనండీ'' అని గంగిరెద్దులా తలూపేడు.

కొన్ని రోజులు గడిచాయ్.

బ్రాంచి సజావుగా సాగిపోతోంది. సీతాపతి వైఖరిలో మాత్రం నేనాశించిన మార్పు రాలేదు. చిరాకు కలిగి ఒకరోజు అతడి లోపాలని ఉటంకిస్తూ సరిదిద్దుకోకపోతే తగు చర్య నిమిత్తం పైవాళ్ల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లవలసి వస్తుందని మెమో ఇచ్చాను.

***

ఆ రోజు సాయంత్రం సీతాపతి మరో వ్యక్తితో కలిసి మా ఇంటికొచ్చాడు.

''మా మామగారు!'' అంటూ అతను పరిచయం చేస్తున్న వ్యక్తిని చూడగానే నాతోపాటు ఆ వచ్చిన వ్యక్తి కూడా ఆశ్చర్యచకితుడయ్యాడు. అతడు మరెవరో కాదు! హైదరాబాదు మగపెళ్లి వారి అధికార ప్రతినిధి!!

నన్ను చూడగానే ఒకసారి ఖంగుతిన్నట్టు ముఖంపెట్టి వెంటనే తేరుకుని, ''ఓహో! మీరేనా? అంటే మనం బంధువులమన్నమాట!'' అన్నాడు నా చెయ్యి పట్టుకుని కుదిపేస్తూ.

నేను చిన్నగా నవ్వి, కూర్చోమంటూ సోఫా చూపించాను. మా ఆవిడ కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆవిడకి కొత్త వ్యక్తిని పరిచయం చేశాను.

కొంతసేపు ఏవేవో మాటలు చెప్పి తర్వాత, ''అల్లుడికి మెమో ఇచ్చారట. వచ్చే నెలలో అతడు ప్రమోషన్ ఇంటర్వ్యూకెళ్తాడు. ఈ మెమో అతడి ప్రమోషన్‌కి అవరోధమవుతుందేమో! ఎంతైనా మనం మనం ఒకటే! ఆ మెమో ఉపసంహరించుకుంటే అతడికి ఉపకారం చేసిన వారవుతారు. మా వాడిని గట్టిగా మందలించాను. ఆఫీసు పని శ్రద్ధగా చేసుకోవాలి...'' అన్నాడతడు గుంభనంగా.

ఆ ఇద్దర్నీ ఒకసారి సూటిగా ''చూడండి, సీతాపతి మీద నాకు వ్యక్తిగతంగా ఎటువంటి ద్వేషమూ లేదు. అతనిపై అధికారిగా అతడి లోపాలను ఎత్తి చూపి అతడు సక్రమంగా పనిచేసేలా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈరోజు ఈ మెమోని వెనక్కి తీసుకుంటే రేపు మరొకరి పట్ల కూడా ఇలాగే ప్రవర్తించవలసి వస్తుంది. అది నా స్వభావానికి విరుద్ధం. నా విధి నేను నిర్వర్తించవలసి ఉంది కదా. ఇటీజ్ నథింగ్ బట్ మై రోల్‌ప్లే!'' అన్నాను.

దెబ్బతిన్నట్టుగా నా వైపు చూశాడు. కాసేపు కూర్చున్నాక ఇద్దరూ బయలుదేరారు. గుమ్మం వరకూ వాళ్ల వెనక వెళ్లాను.

''వస్తా''మని చెప్పి ఓ జీవం లేని నవ్వు నవ్వి మెట్లు దిగేడతను.

'రోల్‌ప్లే' ఓన్లీ అని నేను కాకతాళీయంగా అన్నాను. దానిని అతడు సవ్యంగా స్వీకరించాడో లేక పెళ్లయ్యాక అతడన్న మాటనే తిరిగి ఉక్రోషం కొద్దీ అన్నాననుకున్నాడో ఆ దేవుడికే తెలియాలి!

★